# అపహరణ

బులుసు-జీ-ప్రకాశ్

పదహారుగురు మాత్రమే కూర్చుండుటకు— అనే ఆ చిన్న మూడవక్లాసు కంపార్టుమెంటులో నేను కూర్చున్నా. నా కెదురుగా ఇద్దరంటే ఇద్దరే వ్యక్తులు కూర్చున్నారు. మొదటి వ్యక్తి మాత్రం నన్ను చూసీ చూడ్డంతోనే ఆకర్షించాడు. చక్కని పేంటూ, పేంటులో దోపుకొని షర్టు కాలికి బూటు, టిప్‌టాప్‌గా ఉన్నాడు. చేతి రుమాలు తీసి, మొహానికి చమటపట్టకపోయినా, తుడుచుకుంటున్నాడు. గాలివల్ల జుత్తు ఫాలభాగంపై పడుతుంటే జుత్తును మీది కెగ ద్రోస్తున్నాడు. నల్లని చలువ కళ్ళద్దాలుకూడా తాను అలంకరించుకున్న సరుకుల్లో ఒకటి. ఆ కళ్లద్దాలు తీస్తూ తన కళ్ళను నలుపుకుంటూ మళ్ళీ కళ్లద్దాలు ధరిస్తూన్నాడు.

ఇంక రెండో వ్యక్తి ఒక మోస్తరుగా ముదుసలి అని చెప్పకతీరదు. అతని సంగతి చెప్పాలంటే మొదటి వ్యక్తికంతా వ్యతిరేకం. చాలా బధకస్థునిలా వున్నాడు. పైమీద వోణీ వేసుకుని కునుకుపాట్లు పడుతున్నాడు. తన గెడ్డం క్రింద రెండు కన్నీటి మరకలున్నాయ్. ఎంచేతో నా కర్థంకాలేదు! అంతా నిశ్శబ్దం.

"అబ్బ! ఎంత హీట్‌గావుంది. వేసవికాలం ప్రారంభమైంది కాబోలు. ఈ వెధవ ట్రెయిను కూడా మందగమనం సాగిస్తోంది" అంటూ నిశ్శబ్దాన్ని ఛీల్చివేశాడు, ఆ షోకిల్లా.

అతని మాటలు వినగానే నేనా ముదుసలి వైపు చూశాను తానేమైనా సమాధానం యిస్తాడేమోనని. కానీ, అబ్బే! ఆఘటం వాటం చూస్తే జవాబిచ్చేటట్టు లేదు. ఇక జవాబివ్వడం నావంతని అందుకున్నాను—

"నిజమే! చీకటికొంపలో కూర్చున్నామా అన్నట్లుంది."

"అసలీ ప్రపంచమంతా చీకటి! ఒక్క కంపార్టుమెంటే అనడమెందుకు?" అని ఊరుకుంటాడేమో అనుకున్నా. కానీ మళ్ళీ అన్నాడు కొద్ది ఆశ్చర్యంతో—"ఆఁ! అన్నట్లు మరచాను. మనపేర్లు ఒకసారి ఒకళ్ళకొకళ్లు చెప్పుకుందాం. మీపేరు?" అనగానే పేరు చెప్పాను.

"నా పేరు సూర్యమోహన్. నేను మామూలు ప్రయాణీకుణ్ణే. విజ్ఞానంకోసం దేశసంచారం చేస్తున్నాను" అంటూ చిరునవ్వు నవ్వాడు.

నేనా ముదుసలివైపు చూశాను, తన పేరు చెప్తాడేమోనని- కానీ లాభం లేకపోయింది. అతను మా యిద్దరికీ సంపూర్తిగా వ్యతిరేకమూర్తి!

తను జేబులోంచి మనీపర్సు తీసి, విప్పి ముద్దు పెట్టేసుకుంటున్నాడెందుకూ! సూర్యమోహన్ ఇది చూసి— "చూశారా వాడు! నూరు రూపాయల నోటుని ముద్దెట్టుకున్నాడు. లోభి!" అని పకపకా నవ్వాడు. సూర్యమోహన్ చెప్పిందాట్లో అబద్ధమేమీ లేదని నేను మౌనముద్ర వహించాను.

"ప్రపంచం గుడ్డిదని చెప్పడంలో అబద్ధమేమీ లేదు." సూర్యమోహన్ సంభాషణకు లంకించుకున్నాడు— "పూర్తిగా పాడైంది వెధవ ప్రపంచం! ప్రతి విషయంలోనూ, ప్రతి వ్యక్తిలోనూ, ఏదో లోసుగుంటున్నది. మానవ జన్మ దేవుడు చేసిన పొరపాట్లలో మొదటిది. దేవుడు వెర్రివాడు! కాకపోతే ఇటువంటి పిసినారి వెధవల్ని, దొంగవెధవల్నీ సృష్టించమన్నదెవరు?" అంటూ వేదాంతం చెప్పుకుపోయాడు. అన్నీ నేనుబుద్ధిగా చక్కా వింటూ తలూపాను.

ఇంతలో ముసలాయన పర్సును ప్రక్కకు పెట్టేసి గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అస్తమిస్తున్న అరుణుడి కోణకిరణాలు కిటికీలోంచి కంపార్టుమెంటులోకి ప్రసరిస్తున్నాయ్. రైలు శయంగా పరుగెడుతోంది.

"డబ్బుకంటే విలువైనదీ జగత్తులో మరో

కటి లేనట్లుంది.” సూర్యమోహన్ సంభాషణలో నిమగ్నుడయ్యాడు—“అయినా చూడండి. ఆ లోభి తన పర్సుమీద ఎట్లా చెయ్యి వేశాడో! మనం, ఈ బుర్రలేని మానవులం ఎప్పుడూ మంచివాళ్ళం కానేరం. నూటికి తొంభై తొమ్మండుగురు ప్రపంచంలో వెర్రివాళ్ళంటే ఆశ్చర్యమేముంది?” అన్నాడు.

ఇంతలో ముసలాయన పర్సు క్రిందికి పడింది.

నేను సూర్యమోహన్ మాటలకి జవాబు చెప్పేలోగా మళ్ళీ అతనందుకున్నాడు—“ఆఁ! ప్రకాశ్ గారూ! నేనొక మంచి ప్లాను వేశాను. మనం ఆ పర్సు తీసి దాచేద్దాం. తను లేచి ఏం చేస్తాడో చూద్దాం!”

నేను సూర్యమోహన్ చెప్పినదానికి అంగీకరిస్తూ నేనే ఆ పర్సును తీసి దాచేద్దామనుకున్నా. కానీ ఆ పర్సు నాకన్నా ముందుగానే సూర్యమోహన్ చేతిలోకి ప్రవేశించింది.

అప్పటికి అప్పుడే నా కళ్లు ముడతలు పడుతున్నాయ్. నిద్రాదేవి బంధించ యత్నిస్తోంది. “అయ్యో! ఓ గడియ పడుకుంటానండీ! గాఢంగా నిద్ర వస్తోంది” అన్నాను. సూర్యమోహన్ చిన్న నవ్వు నవ్వాడు.

ఒక్క ఘనమైన కునుకు తీశాను. కళ్లు నులుముకుంటూ విప్పాను. అయ్యో! మహేశ్వరా! సూర్యమోహన్ ఏమయ్యాడు? గాభరా పడిపోయాను. అప్పటికప్పుడే ఆ ముసలి లేచి వున్నాడు. అతను నెమ్మదిగా అడిగాడు:

“నాయనా! నా మనీపర్సుగాని ఇక్కడెక్కడైనా చూశావా? పోయినట్లుంది!”

నా శరీరంలో రక్తపు చుక్క లేదు. కొయ్యబారిపోయాను. సూర్యమోహన్, ఆ పెద్దమనిషి ఆ వేదాంతి, ఆ పర్సును అపహరించేడు! కొంప తీసి ఆయన దొంగతనం నామీద పెట్టి పళ్లు రాలగొడతాడనుకున్నాను.

కాని హఠాత్తుగా అతనొక చంటి పిల్లాడిలా ఏడవడం మొదలెట్టాడు. అతని వ్యక్తిత్వం, అతని స్వరూపం చూడగానే నా హృదయం కరిగిపోయింది. అతనిని రోదనని ఆపడానికి ప్రయత్నం చేశాను.

“మీకే అవసరమున్నా, నేను తీర్చగలను. నేను మీకు కావలసినంత ధనసహాయం చేస్తాను. క్షమించండి! మీ పర్సును అపహరించింది నేను కాదు” అన్నాను.

“నాయనా! నేను డబ్బును చూసి లోభి వలె ముద్దుపెట్టుకునే రోజులు గడిచిపోయాయి. ప్రస్తుతం నేను వృద్ధుణ్ణి.

“ఆ పర్సులో ఏముందో తెలుసా! నూరు రూపాయల నోటుందని కదూ నీకు సూర్యమోహన్ చెప్పాడు? ఒక్క కానీ కూడా లేదు. ఏదీ నాకది పరమేశ్వరుడివ్వందే? కానీ ప్రపంచంలో ఒక అమూల్యమైన వస్తువు ఒక్కటుంది. అదే నా హృదయసీమ!”

శిలా ప్రతిమలా అతనట్లా కూర్చుని విచారంగా ముఖం పెట్టాడు. మళ్ళీ అతను చిన్న శోక స్వరంతో చెప్పడం మొదలు పెట్టాడు.

“నా ఏడేళ్ళ కూతురు మృదుల... నన్ను విడిచి మొన్ననే ఒక వెలుగు జగతిలోకి ప్రవేశించింది. ఆమె ఒక్కర్తే... లోకంలో నాతో సంబంధం గల వ్యక్తి.”

అతని మాటలు వింటూ, అతని ముఖ వర్చస్సును తదేక దీక్షతో పరికిస్తున్నందువల్ల నా కంటి నుండి బాష్పాలు రాలాయ్. పాపం, అతను నా కంటి బిందువులు తుడుస్తూ,

“ఫర్వాలేదు. దీనికంతటికీ కారకుడువి నీవు కాదు. ఆ ఫోటో పోయిందని నాకు మాత్రం విచారం అనుకున్నావా? నా వద్దను మరొక ఫోటో వుంది నాయనా. అది నా హృదయంలోనే వుంది. నా మృదుల నా హృదయంలోనే వుంది. నా మృదులను నా హృదయంలోంచి గజదొంగలైనాసరే అపహరించలేరు! అపహరించలేరు! హరహర మహాదేవ్!...”

స్టేషనులో బండి ఆగింది. అతను తన సామాను సర్దుకుని, “వస్తాను బాబూ! పరమేశ్వరుడు నిన్ను రక్షిస్తాడు” అన్నాడు.

అతను స్టేషన్ దాటి అవతలకెళ్ళి తిన్నగా రోడ్డుమీద నడక సాగిస్తున్నాడు. అతను నా కంటికి అవుపించేదాకా, అతన్ని తదేకదృష్టితో చూస్తున్నాను. అంతలో అతను మాయమయ్యాడు.

మళ్లీ నా కళ్ళనుండి నాలుగు జల బిందువులు రాలాయ్! కళ్లు మూసుకుని పరమశివుని ధ్యానించాను.